
సాక్షి
ములుగు

బుధవారం । 23 । జూలై । 2025



పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేద్దాం - 8లో▸
సమన్వయంతో పనిచేసి రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేద్దామని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అధికారులకు పిలుపునిచ్చారు.



దూరవిద్య డిగ్రీ పరీక్షలు ఎప్పుడో!
దూరవిద్య (ఇయర్ వైజ్ స్కీం) డిగ్రీ కోర్సుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడంలో ఎస్‌డీఎల్‌సీఈ అధికారులు జాప్యం చేస్తున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/24^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- వీసీలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి



ములుగు రూరల్: ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులదేనని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం సచివాలయం నుంచి సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్.ప్రియాంక, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి జి.మల్సూర్‌లతో కలిసి అన్ని జిల్లాల పౌర సంబంధాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకెళ్తుందని తెలిపారు. ఏడాదిన్నర కాలంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లలేక పోతున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రస్థాయి అధికారులు ఆర్జేడీ జగన్, అన్ని జిల్లాల డీపీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ.6.46లక్షలు



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయ ఆవరణలో మంగళవారం కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు వేలం పాటలు నిర్వహించగా రూ.6.46లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్ తెలిపారు. సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ద్వారా పాట నిర్వహించగా గతేడాది కంటే లక్షా 26 వేల ఆదాయం ఎక్కువగా సమకూరిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ పరిశీలకులు కవిత, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్, సిబ్బంది సంతోష్, అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా పాఠకుల హర్షం



ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో మహిళా పాఠకులకు టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో మహిళా పాఠకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాంగణంలో టాయిలెట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. మహిళా పాఠకుల అవస్థలను గమనించి టాయిలెట్స్ నిర్మించిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులపై పెరుగుతున్న దాడులు



గోవిందరావుపేట: జిల్లాలోని రైతులపై రోజురోజుకూ ఫారెస్ట్ అధికారుల దాడులు పెరిగిపోతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మ ల వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని పస్రాలో సీపీఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు లక్నవరం నీటిని అందించాలన్నారు. గోదావరిలోకి ప్రతిరోజూ లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతుందన్నారు. దేవాదుల ప్రాజెక్టు, సమ్మక్కసాగర్ బ్యారేజీ జిల్లాలో ఉన్నప్పటికీ రైతులకు నీరు అందకపోవడం బాధాకరం అన్నారు. రేపు స్వాతంత్ర్య సమరయోధుడు, పార్టీ సీనియర్ నాయకుడు వీరపనేని రామదాసు వర్ధంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు చిట్టిబాబు, ఆదిరెడ్డి, రాజేష్, మల్లారెడ్డి, అశోక్, రాజు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఫొటోలు దిగితేనే
వేతనం



ఏటూరునాగారంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉపాధి హామీ పథకంలో కొత్త నిబంధనలు
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ
- ఒక ఫొటో తీస్తే సగం కూలి వర్తిస్తుందని స్పష్టం చేసిన కేంద్రం
- 14 నుంచి అన్ని స్థాయిల్లో శాంపిల్‌గా ఫొటోల పరిశీలన

ఏటూరునాగారం: ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. కొన్నిచోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ శ్రామికుల డబ్బులు దోచుకోవడం, మరికొందరు పనికి రాకున్నా అటెండెన్స్ వేయించుకుంటున్నారు. దీంతో ఇకపై పనిచేసే చోట కూలీలకు రెండుసార్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉపాధి హామీ కూలీల హాజరులో అవకతవకలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉపాధి హామీలో పనిచేసేందుకు వచ్చిన కూలీల ఫొటోలను రెండు పూటలా తీయాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలోని 9మండలాల పరిధిలో గల అధికారులు ఈ నెల 14 నుంచి గ్రామాల వారీగా శాంపిళ్లను తీస్తున్నారు.

కొత్త అంశాలివే..
ఫొటోల వెరిఫికేషన్ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ నుంచి కమిషనర్ వరకు కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. మేట్, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సంబంధం లేని ఫొటోని అప్‌లోడ్ చేశారా.. పని ప్రదేశంలో లైవ్ ఫొటో కాకుండా పాత ఫొటోను అప్‌లోడ్ చేశారా.. ఫొటోలో ఉన్న వ్యక్తుల సంఖ్య, మస్టర్‌లో హాజరైన వ్యక్తుల సంఖ్యలో తేడా ఉందా అన్న వివరాలు గమనించాలని సూచించింది. అలాగే ఫొటోల్లో ఉన్న స్త్రీ, పురుషుల సంఖ్య, మస్టర్‌లో హాజరైన సంఖ్యతో సమానంగా ఉందా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వేర్వేరు మస్టర్‌లలో ఒకే వ్యక్తులను క్యాప్చర్ చేశారా అనే వివరాలను వెరిఫై చేయాలని కేంద్రం ఆదేశించింది.

ఫీల్డ్ అసిస్టెంట్లకు షరతులు
వర్క్ సాంక్షన్ లేనిది ఏ పని కూడా స్టార్ట్ చేయొద్దు. డిమాండ్ చేసి మస్టర్ మేట్‌కు ఇచ్చిన తర్వాతనే పని ప్రారంభించాలి. ఒక ఫీల్డ్ అసిస్టెంట్‌కు రెండు, మూడు గ్రామ పంచాయతీలు ఉంటే ఒకే గ్రామ పంచాయతీలో పని ప్రారంభించాలి. వర్క్‌సాంక్షన్ లేకుండా పనిచేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిగే నష్టం ఏమిటంటే ఒక వేళ ప్రమాదవశాత్తు ఎవరికైనా పనిప్రదేశంలో ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఉంటుందని ఉత్తర్వుల్లో తెలిపారు.

పర్యవేక్షణ కట్టుదిట్టం
ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తీసిన ఉపాధి కూలీల అటెండెన్స్ ఫొటోలన్నింటినీ ప్రతిరోజూ జిల్లాలోని 174 పంచాయతీల్లో సెక్రటరీలు వెరిఫై చేసి రిపోర్ట్‌ను ఎంపీడీఓలకు పంపించాల్సి ఉంది. మండల స్థాయిలో అన్ని గ్రామాల నుంచి ఒక రోజులో వచ్చిన మొత్తం ఫొటోల్లో కనీసం 20శాతం ఫొటోలు లేదంటే గ్రామానికి రెండు ఫొటోల చొప్పున ఎంపీడీఓ ఆఫీస్‌లోని ఏపీఓ, కాంట్రాక్ట్ స్టాఫ్, పర్మనెంట్ స్టాఫ్ అదే రోజు వెరిఫై చేసి రిపోర్ట్‌ను కలెక్టర్, డీఆర్‌డీఓకు పంపించాలి. జిల్లా స్థాయిలో ముందు రోజు క్యాప్చర్ చేసిన ఫొటోల్లో కనీసం 30 ఫొటోలను కలెక్టర్ వెరిఫై చేయాల్సి ఉంటుంది. డీఆర్‌డీఏ కాంట్రాక్ట్, పర్మనెంట్ స్టాఫ్ ఒక్కొక్కరు జిల్లా వ్యాప్తంగా వచ్చిన మొత్తం ఫొటోల్లో రోజుకు 10శాతం లేదా 200 ఫొటోలను వెరిఫై చేయాలి. అలాగే గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ రోజుకు 20 ఫొటోలను వెరిఫై చేయాల్సి ఉంటుందని సూచించారు.

రెండు ఫొటోలు తీయాలి
కూలీలు పనులు చేసే ప్రదేశంలో ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో రెండు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అప్పుడే వారికి వేతనం వస్తుంది. ఫొటో ఉంటే హాజరు ఉన్నట్లుగా పరిగణలోకి తీసుకుంటారు. ఫొటోలు అప్‌లోడ్ చేయకపోతే వేతనం కూలీలకు వచ్చే అవకాశం లేదు. ఈజీఎస్‌లో అక్రమాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెల 14 నుంచి నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.
- చరణ్, ఈజీఎస్ ఏపీఓ, ఏటూరునాగారం

ఏజెన్సీలో భారీవర్షం



ఏటూరునాగారంలో కురుస్తున్న భారీవర్షం



బురదమయంగా మారిన కొండాయి రోడ్డు

ఏటూరునాగారం: ఏజెన్సీలోని ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో గోదావరి, వాగులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు అలర్ట్ చేశారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉండొచ్చని వాతావరణ శాఖ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై వాగుల వద్ద సిబ్బంది గస్తీ ఉండే విధంగా చర్యలు చేపట్టింది. అంతేకాకుండా గత నెల నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వాగులు, లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలు సురక్షితంగా ఉండే విధంగా సూచనలు, సహాయక చర్యలను చేపట్టారు. పోలీసులు, రెవెన్యూ, ఐటీడీఏ, గ్రామ పంచాయతీల అధికారులు, సిబ్బంది వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు 24గంటలు మానిటరింగ్ చేసేవిధంగా కలెక్టర్ దివాకర ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా మంగళవారం ఉదయం కొండాయి వద్ద కురిసిన వర్షానికి మట్టిరోడ్డు బురద రోడ్డుగా మారింది. దీంతో ప్రజలు నడిచేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం



కలెక్టర్ దివాకర

ములుగు రూరల్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగుపాటుకు గురికాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు వస్తున్నాయంటే పిడుగుపాటుకు సంకేతాలని వివరించారు. పిడుగుపాటుకు గురైన వారు ఎక్కువ శాతం చెట్ల కింది నిలబడడం, విద్యుత్ వైర్లకు అందుబాటులో ఉండడంతో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. పిడుగులు పడే సమయంలో లోహపు వస్తువులను వినియోగించడం, నీటిలో ఉండకూడదని వివరించారు. భూమి మీద అరికాళ్లు పూర్తిగా పెట్టకుండా వేళ్ల పై కూర్చోవడం, మోకాళ్లపై చేతులు తలపెట్టుకొని ముడుచుకొని కూర్చుంటే పిడుగు పడిన సమయంలో విద్యుత్ ప్రభావం తక్కువగా పడుతుందని వెల్లడించారు. వర్షాల కారణంగా ప్రమాదాలు సంభవించినప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 18004257109కు సమాచారం అందించాలని కలెక్టర్ దివాకర సూచించారు.

ధరలపై అభ్యంతరాల స్వీకరణ

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరలో భక్తుల కేశఖండన, వాహనాల పూజ టిక్కెట్ల ధరల విషయంలో భక్తులు 15 రోజుల్లో అభ్యంతరాలు తెలిపాలని మేడారం ఈఓ వీరస్వామి మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. భక్తుల కేశ ఖండన టిక్కెట్ ధర రూ.10 నుంచి రూ. 50 వరకు పెంచినట్లు వెల్లడించారు. ద్విచక్ర వాహనానికి రూ. 100, ఆటోకు రూ. 150, బస్సు, లారీ, ట్రాక్టర్, జేసీబీ, భారీ వాహనాలకు రూ. 200 నిర్ణయించినట్లుగా వివరించారు. టిక్కెట్ల ధరల విషయంలో భక్తులు సూచనలు, అభ్యంతరాలను 15 రోజుల్లో రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ఏటూరునాగారం/మంగపేట/ఎస్ఎస్‌తాడ్వాయి/కన్నాయిగూడెం: అర్హులందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లాలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెం, ఎస్ఎస్‌తాడ్వాయి, మంగపేట మండలాల్లో మంగళవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించగా మంత్రి హాజరై మాట్లాడారు. పదేళ్లుగా ప్రజలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఇచ్చినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులు చాలా ప్రధానమన్నారు. ఇళ్లు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ, వ్యక్తిగత బీమా సౌకర్యం, ఇతర అవసరాలకు కూడా రేషన్ కార్డు ప్రధానమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మంగళవారం నుంచి రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రేషన్‌కార్డుల ప్రక్రియ నిరంతరంగా సాగుతుందని దళారులను నమ్మకుండా నేరుగా మీసేవ కేంద్రాల్లో, సంబంధిత మండల అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మంగపేటలో రేషన్‌కార్డులతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎఫ్ఎస్‌సీఎస్ కార్యాలయ ఆవరణలో నాబార్డు, డీసీసీబీ వారి సహకారంతో మల్టీసర్వీస్ కోఆపరేటివ్స్(ఎంఎస్‌సి) స్కీం ద్వారా రూ 76 లక్షల నిధులతో 1000 మెట్రిక్ టన్నుల నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మించిన నూతన గోదాంను ప్రారంభించారు.

డీసీసీ బ్యాంకు ప్రారంభం
ఏటూరునాగారం మండల పరిధిలోని తాళ్లగడ్డ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన బ్యాంకును మంత్రి సీతక్క తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా లతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలు బ్యాంకును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా రూ.2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిందన్నారు. రైతు భరోసా కింద 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాలలో వేసి రికార్డు సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, తహసీల్దార్ జగదీశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, సీఈఓ గౌరీ, ఏపీఓ వసంతరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, జీపీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలోని తాళ్లగడ్డలో డీసీసీ బ్యాంకును ప్రారంభిస్తున్న సీతక్క



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న సీతక్క

వెదురు ప్లాంటేషన్‌కు మొక్కలు సిద్ధం

ఏపీఓ చరణ్‌రాజ్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్లాంటేషన్ కోసం వెదురు మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని మొక్కలను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. 21వేల మొక్కలను ప్రత్యేకంగా మణిపూర్ నుంచి తెప్పించినట్లు తెలిపారు. ఈ మొక్కలను మహిళా సంఘాల ద్వారా గ్రామాల వారీగా లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు కుటుంబాలకు సంబంధించి ప్రతీ ఏడాది రూ.లక్ష ఆదాయం వచ్చే విధంగా వారిని ప్రోత్సహించనున్నట్లు వివరించారు. ప్లాంటేషన్ ద్వారా నాలుగేళ్ల నుంచి 40 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం రావడానికి ప్రతీ రైతుకి 15 గుంటల భూమిలో 60 మొక్కలు నాటుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వెదురు మొక్కలు నాటే ఉద్దేశం ఉన్న వారందరికీ ఉచితంగా మొక్కలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మొక్కలు తీసుకోదలచిన వారు ఉపాధి హామీ జాబ్‌కార్డు, పట్టా జిరాక్స్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వెదురు మొక్కలు చూపిస్తున్న ఏపీఓ

ఆర్టీసీకి మహాలక్ష్మి కళ

సంస్థకు అనూహ్యంగా పెరిగిన ప్రయాణికులు
- ఉచిత ప్రయాణంతో 93 శాతానికి పెరిగిన ఓఆర్
- ఆర్థికలేమి నుంచి బయటపడుతున్న సంస్థ
- నేడు రీజియన్ పరిధి అన్ని డిపోల్లో సంబురాలు



హన్మకొండ: ఆర్టీసీకి మహాలక్ష్మి కళ సంతరించుకుంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో ప్రగతి రథ చక్రాలు పరుగులందుకున్నాయి. గతంలో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించేవారు సైతం ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల వైపు మళ్లారు. పథకానికి ముందు 70శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ రేషియో పథకం అమలయ్యాక 93 శాతానికి పెరిగింది. పల్లె వెలుగు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 110 నుంచి 120 శాతానికి చేరుకుంది. మహిళలకు ఫ్రీ జర్నీ కావడంతో వారి కుటుంబ సభ్యులు (పురుషులు) కూడా ఆర్టీసీలోనే ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసి నడుస్తున్నాయి. ప్రభుత్వం ఉచిత బస్సు సొమ్మును ఆర్టీసీకి చెల్లిస్తుండడంతో సంస్థ ఆర్థిక లేమి నుంచి క్రమంగా బయటపడుతోంది.

వరంగల్ రీజియన్‌లో ఇలా..
మహాలక్ష్మి పథకాన్ని ప్రభుత్వం 2023 డిసెంబర్ 15 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. అప్పటినుంచి నేటి వరకు వరంగల్ రీజియన్‌లో 15,41,10,000 మంది మహిళలు ప్రయాణించి రూ.688,35,58,000 చార్జీలు ఆదా చేసుకున్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం నాటి నుంచి నేటి వరకు ఉచిత, చార్జీలు చెల్లించిన ప్రయాణికులు మొత్తం 23,98,67,000 ప్రయాణించగా.. రూ.1401,63,14,000 ఆదాయం వచ్చింది. ఇందులో చార్జీలు చెల్లించిన ప్రయాణికులు 8,57,58,000 ఉన్నారు. వీరి ద్వారా రూ.713,27,56,000 ఆదాయం వచ్చింది. మొత్తం ప్రయాణికుల్లో ఉచిత ప్రయాణం చేసిన వారు 64శాతం మంది ఉన్నారు. వీరి ద్వారా ఆర్టీసీకి 49శాతం ఆదాయం వచ్చింది. చార్జీలు చెల్లించిన వారు 36శాతం ప్రయాణించగా వీరి ద్వారా 51శాతం ఆదాయం వచ్చింది.

నేడు అన్ని బస్‌డిపోలు, స్టేషన్లలో సంబురాలు
ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం ద్వారా 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసిన సందర్భంగా నేడు(బుధవారం)రాష్ట్ర వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ సంబురాలు జరుపుతోంది. ఈ మేరకు వరంగల్ రీజియన్‌లోని అన్ని డిపోలు, ప్రధాన బస్ స్టేషన్‌లలో మేనేజర్లు ఏర్పాట్లు చేశారు. మహాలక్ష్మి పథకంపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇప్పటికే వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. అదే విధంగా ఆర్టీసీ బస్సులో క్రమం తప్పకుండా ప్రయాణించే ఐదుగురు మహిళలను ఎంపిక చేసి సన్మానించనున్నారు. వారికి బహుమతులు అందించనున్నారు. ఈ సంబురాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులను ఆహ్వానించారు. వరంగల్ బస్‌స్టేషన్‌లో జరిగే సంబురాల్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొననున్నారు.

వరంగల్ రీజియన్‌లోని డిపోల వారీగా ప్రయాణికులు, ఆదాయం వివరాలు (రూ.లక్షల్లో)...

డిపో	మహాలక్ష్మి ప్రయాణికులు	మహాలక్ష్మి ఆదాయం	నాన్ మహాలక్ష్మి ప్రయాణికులు	నాన్ మహాలక్ష్మి ఆదాయం
హనుమకొండ	305.68	9658.61	128.93	8351.40
వరంగల్-1	132.63	5541.54	101.14	15325.45
వరంగల్-2	127.35	7818.34	105.23	12972.48
పరకాల	147.91	5920.53	83.28	4221.54
భూపాలపల్లి	144.71	7447.00	77.25	6428.55
జనగామ	226.64	10897.12	112.77	7492.23
మహబూబాబాద్	138.31	5956.19	68.15	3389.06
నర్సంపేట	173.34	7335.12	98.55	6357.02
తొర్రూరు	144.52	8261.13	82.27	6789.83

ఉచిత ప్రయాణంతో మహిళలకు గౌరవం



నేను ఔట్‌సోర్సింగ్ ప్రైవేట్ ఎంప్లాయిని. రోజూ ముల్కనూరు నుంచి హనుమకొండకు వచ్చి వెళ్తాను. జనరల్ పాస్ తీసుకోవడం ద్వారా నెలకు రూ.960 చార్జీలు అయ్యేవి. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఇప్పుడు నాకు ఆ డబ్బులు మిగులుతున్నాయి. ఉచిత ప్రయాణంతో మహిళలకు ప్రభుత్వం తగిన గౌరవం కల్పించింది.
- పావని, ముల్కనూరు, ప్రయాణికురాలు

డబ్బులు ఆదా అవుతున్నాయి..



మహాలక్ష్మి పథకంలో భాగంగా.. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా డబ్బు ఆదా అవుతోంది. నాకు నెలకు రూ.2వేలు బస్సు చార్జీలు అయ్యేవి. ఇప్పుడు ఈ ఖర్చులు ఆదా అవుతున్నాయి. పేద మహిళలకు ఉచిత ప్రయాణం ఎంతో మేలు చేస్తోంది.
- సుమలత, మడికొండ, ప్రైవేట్ ఉద్యోగి

మెరుగైన సేవలందిస్తున్నాం..



మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ బస్సు సౌకర్యంతో ఆర్టీసీ బస్సులకు ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఈమేరకు ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నాం. రద్దీ ఉన్న రూట్లలో బస్సుల సంఖ్య పెంచాం. ప్రయాణికులను సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్నాం.
- డి.విజయ భాను, ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్

'పెండింగ్ బిల్లులు చెల్లించి ఎన్నికలకు వెళ్లాలి'

వాజేడు: గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన పెండింగ్ బిల్లులతో పాటు మాజీ సర్పంచ్‌లు చేయించిన పనుల బిల్లులు చెల్లించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆదివాసీ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ కార్యదర్శి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పూసం నరేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఇంత వరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఏళ్లు గడుస్తున్నా బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు సైతం బిల్లులు ఇవ్వడం లేదన్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి గత ప్రభుత్వ హయాంలో నెలనెలా వేతనాలు వచ్చేవని ఇప్పుడు రావడం లేదని తెలిపారు. గ్రామ పంచాయతీలో పనులు చేసిన వారికి బిల్లులు రాక, సిబ్బందికి వేతనాలు లేక ఇబ్బందులు పడుతుంటే మంత్రి సీతక్క దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. గతంలో చేసిన పనుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయడంతో పాటు సిబ్బంది, కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

క్లుప్తంగా

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) –గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ రవి తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళలు అర్హులన్నారు. ములుగు, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన మహిళలు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. 18–45 ఏళ్ల వయసు కలిగి తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు నాలుగు పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, రేషన్, ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో ఈనెల 25వ తేదీలోపు హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9849307873, 9949108934 నంబర్లను సంప్రదించాలన్నారు.

కాజీపేట మీదుగా ప్రయాణించే పది ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

కాజీపేట రూరల్ : సౌత్ ఈస్టన్ రైల్వేలో చక్రధర పూర్ రైల్వే డివిజన్‌లోని జార్సుగూడ యార్డులో జరిగే రైల్వే నాన్ ఇంటర్‌లాకింగ్ వర్క్స్‌తో కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా ప్రయాణించే పది ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రద్దు చేసినట్లు రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ మంగళవారం తెలిపారు.

ఆయా తేదీల్లో రద్దయిన రైళ్ల వివరాలు..

ఆగస్టు 26, సెప్టెంబర్ 9వ తేదీన చర్లపల్లి–దర్భాంగా (17007) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 29, సెప్టెంబర్ 12వ తేదీల్లో దర్భాంగా–చర్లపల్లి (17008) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 28వ తేదీన హైదరాబాద్–రక్సోల్ (17005) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 31వ తేదీన రక్సోల్–హైదరాబాద్ (17006) ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 30వ తేదీన చర్లపల్లి–రక్సోల్ (07051) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 2వ తేదీన రక్సోల్–చర్లపల్లి (07052) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 1వ తేదీన చర్లపల్లి–రక్సోల్ (07005) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 4వ తేదీన రక్సోల్–చర్లపల్లి(07006) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 8వ తేదీన హెచ్.ఎస్. నాందేడ్–సంత్రగచ్చి (12767) ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 10వ తేదీన సంత్రగచ్చి–హెచ్.ఎస్.నాందేడ్ (12768) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

జ్వరంతో విద్యార్థి మృతి



జశ్వంత్(ఫైల్)

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి దొడ్డిపట్ల జశ్వంత్(18) జ్వరం, పచ్చకామెర్లతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. 15 రోజులుగా వరంగల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. మళ్లీ జ్వరం రావడంతో వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడు ఇంటర్ పూర్తి చేశాడు. డిగ్రీలో చేరాల్సి ఉంది. కాగా, జశ్వంత్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



దూరవిద్య డిగ్రీ పరీక్షలు ఎప్పుడో!

సప్లిమెంటరీ ఫీజులు సైతం వసూలు..

- నిరీక్షిస్తున్న 6,090 మంది విద్యార్థులు



కేయూ క్యాంపస్ : ఒకప్పుడు డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులన్నిటిలో వేలాదిమంది విద్యార్థుల అడ్మిషన్లతో ఓ వెలుగు వెలిగిన కాకతీయ యూనివర్సిటీ దూర విద్య సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) ప్రస్తుతం వెలవెలబోతుంది. పుస్తకాల అందజేత, కాంటాక్టు తరగతుల నిర్వహణ, పరీక్ష ఫలితాల విడుదలలో జాప్యంతో దూరవిద్యలో డిగ్రీ, పీజీ అడ్మిషన్ల సంఖ్య తగ్గిపోతోంది. దూరవిద్య (ఇయర్ వైజ్ స్కీం) డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ, ద్వితీయ, ఫైనల్ ఇయర్ కోర్సుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడంలో జాప్యం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే .. గతేడాది జూలైలో విద్యార్థులకు డిగ్రీ కోర్సులకు (ఇయర్ వైజ్) పరీక్షలు నిర్వహించారు. అదే ఏడాది అక్టోబర్‌లో ఆయా పరీక్షల ఫలితాలను వెల్లడించారు. కొద్దిరోజులకే డిగ్రీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని దూరవిద్యకేంద్రం అధికారులు ప్రకటించడంతో ఇక డిగ్రీ ప్రథమ, ద్వితీయ, ఫైనల్ ఇయర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు (వివిధ సబ్జెక్టుల్లో) పరీక్ష ఫీజు చెల్లించారు. నెలలు గడిచిన ఆ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారని అడుగుతు వస్తున్నారు. గత కొన్నినెలల క్రితమే పరీక్షల విభాగం అధికారులు మాత్రం దూరవిద్య డిగ్రీకి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం లేదని మళ్లీ వార్షిక పరీక్షలు జూన్‌లో నిర్వహిస్తామని చెబుతూ వచ్చారు. దీంతో విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలపై ఆశలు వదులుకున్నారు. జూలై 21వతేదీ గడిచినా ఇప్పటివరకు ఆయా డిగ్రీ బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పరీక్షల టైంటేబుల్‌ను పరీక్షల విభాగం అధికారులు ఎప్పటినుంచి నిర్వహిస్తారనేది వెల్లడించడం లేదు.

ఫీజు చెల్లించిన 6,090మంది విద్యార్థులు

దూరవిద్య డిగ్రీ కోర్సుల్లో (ఇయర్‌వైజ్) ప్రథమ సంవత్సరంలో (ఎక్స్) 1,796మంది, సెకండియర్‌లో 2,062 మంది, ఫైనలియర్‌లో 2,232మంది మొత్తం 6,090మంది విద్యార్థులు పరీక్షల ఫీజులు చెల్లించి నిరీక్షిస్తున్నారు. ఫీజులు వసూలు చేసేది దూర విద్య కేంద్రం, నిర్వహించేది పరీక్షల విభాగం అధికారులు. అయితే దూరవిద్య కేంద్రం అధికారులు, పరీక్షల విభాగం అధికారుల మధ్య సమన్వయం లోపంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కరోనా అనంతరం సప్లిమెంటరీ పరీక్షలు పునరుద్ధరించలేదు. గతేడాది జూలైలో డిగ్రీ వార్షిక పరీక్షలు నిర్వహించాక మళ్లీ ఈఏడాది జూలై చివరికి వచ్చినా పరీక్షల టైంటేబుల్‌ను వెల్లడించలేదు. కనీసం వార్షిక పరీక్షలు మళ్లీ నిర్వహించినా అప్పట్లో ఫీజులు చెల్లించిన వారు పరీక్షలు రాసుకునే అవకాశం ఉంటుంది. ఇటీవల దూరవిద్య కేంద్రం సంబంధిత సిబ్బంది డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని పరీక్షల విభాగం అధికారులను కోరగా విద్యార్థుల నుంచి వసూలు చేసిన పరీక్షల ఫీజును పరీక్షల విభాగానికి చెల్లిస్తేనే టైం టేబుల్ విడుదల చేస్తామని అధికారులు పేర్కొన్నారని సమాచారం. దీంతో ఇటీవలే పరీక్షల విభాగానికి దూర విద్యకేంద్రం నుంచి పరీక్షల ఫీజును చెల్లించారని సమాచారం. ఇకనైనా పరీక్షల టైంటేబుల్‌ను వెల్లడించి పరీక్షలు నిర్వహిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

- ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం విజయ భాను

హన్మకొండ: ఉద్యోగులకు సమస్యలుంటే నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ కమిటీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆర్ఎం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు బయటి వ్యక్తులను ఆశ్రయించొద్దన్నారు. వారికి ఆర్టీసీ అధికారులతో మాట్లాడే అవకాశముండదన్నారు. ఉద్యోగులు నేరుగా కలవలేకపోతే అసోసియేషన్ నాయకులతో వచ్చి కలవొచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల ఆర్ఎంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలకు ఆర్టీసీలో అవకాశం లేదన్నారు. ఇలాంటి దాడులకు తాము పూర్తి వ్యతిరేకమన్నారు. యాజమాన్యానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అసోసియేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు గూడెల్లి దేవేందర్, కార్యదర్శి కొత్త నాగయ్య, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ మారపల్లి శేఖర్, కరీంనగర్ జోనల్ ప్రెసిడెంట్ ఊర రామకృష్ణ, నాయకులు బుర్రి తిరుపతి, మూడు రమేశ్ నాయక్, బి.రమేశ్, బానోత్ లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.అశ్వత్థామ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఆర్ఎం డి.విజయ భానుకు ఆర్టీసీ టీఎంయూ వరంగల్ రీజియన్ నూతన కమిటీని పరిచయం చేశారు. అనంతరం ఆర్ఎంతో భేటీ అయి వరంగల్ రీజియన్ కార్మికుల సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. ఆర్ఎం మాట్లాడుతూ రీజియన్‌లో కార్మికులు సంస్థకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. అనంతరం టీఎంయూ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు ఎస్.కె.వై పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.వి.గోపాల్, కార్యదర్శి సి.హెచ్.జితేందర్ రెడ్డి, చైర్మన్ బొల్లేటి కిరణ్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ బి.ఆర్.కుమార్, రీజినల్ చీఫ్ అడ్వైజర్లు ఎం.ఎస్.రావు, కె.ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా జె.పి.రావు, ఆర్.రజిత, ఎం.వెంకన్న, జాయింట్ సెక్రటరీలు ఆర్.సాంబయ్య, ఎం.బి.కె రెడ్డి, డి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు ఆర్.శ్రావణి, బి.రెడ్యా, ఎస్.బి.పతి, టి.విద్యాసాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కె.కవిత, జి.కృష్ణ, జె.రత్నాకర్, ప్రచార కార్యదర్శులు జి.వెంకన్న, కే.ఎస్.రావు, కోశాధికారి పి.పి.రెడ్డిని ఆర్ఎం విజయ భానుకు పరిచయం చేశారు.

అంతర్రాష్ట్ర లారీ దొంగల అరెస్ట్

- రూ.50 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ పండేరీ చేతన్ నితిన్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పండేరీ చేతన్ నితిన్, పక్కన ఎస్సైలు భరత్, చెన్నకేశవులు

జనగామ:లారీలను అపహరిస్తున్న అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జనగామ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సైలు భరత్, చెన్న కేశవులతో కలిసి వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని వర్ధమాన్ నగర్‌కు చెందిన నంద్ కిశోర్ సుఖ్ చంద్ ఖాత్రే, మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన సల్మాన్ మన్సూరీ లారీల అపహరణల్లో సహకరించుకుంటున్నారు. నంద్ కిశోర్ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో తల్లికి నోటి క్యాన్సర్ నిర్ధారణ కావడం, వైద్య కోసం ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో అక్రమమార్గంలో సంపాదించాలని భావించాడు. అనుకున్నదే తడవుగా తెలంగాణలో ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, దేవరకద్ర, సిద్దిపేట, చేర్యాల, మెదక్, నర్సాపూర్, జగిత్యాల, కొడిమ్యాల, మంచిర్యాల, చెన్నూరు, కర్ణాటకలోని బీజాపూర్, తాళి కోటి, ఛత్తీస్‌గఢ్‌లోని మహాసముంద్, మధ్యప్రదేశ్‌లోని నర్సింగాపూర్, కరేలి ప్రాంతాల్లో లారీలను అపహరించారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నంద్ కిశోర్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత అక్కడ నుంచి నేరుగా జనగామ జిల్లాకు వచ్చాడు. జనగామ మండలం వడ్లకొండ నయారా పెట్రోల్ బంకు వద్ద అదే గ్రామానికి చెందిన గొరిగె మహేశ్ తన లారీని పార్క్ చేయగా ఈ ఏడాది జూన్‌లో నంద్‌కిశోర్ అపహరించాడు. లారీతో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు వెళ్లి సల్మాన్ మన్సూరీకి రూ.2లక్షలకు విక్రయించాడు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో అపహరించిన లారీలను తక్కువ ధరకు సల్మాన్ మన్సూరీకి విక్రయిస్తుండగా, ఇద్దరిపై అనేక రాష్ట్రాల్లో ఇద్దరిపై కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఏఎస్పీ చేతన్ నితిన్, సీఐ దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై ఎం.భరత్ సిబ్బందితో కలిసి పెంబర్తి శివారు పెట్రోల్ బంకు వద్ద తనిఖీ చేస్తుండగా నంద్ కిశోర్, సల్మాన్ మన్సూర్ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా లారీని అపహరించినట్లు ఒప్పుకోగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కాగా, దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్సైలు భరత్, చెన్నకేశవులు, కానిస్టేబుళ్లు బి.కరుణాకర్, ఎన్.సాగర్, జె.మహేందర్, పి.అరవింద్, ఎస్.నిరంజన్, ఎండి.సల్మాన్ (ఏఏవో), నరేశ్(ఐటీకోర్)ను సీపీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

మిరప తెగుళ్లపై అవగాహన పెంచుకోవాలి

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ రాజన్న

మామునూరు: మిరప పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్లపై రైతులు అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న సూచించారు. మంగళవారం ఖిలా వరంగల్ మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాస్త్రవేత్త రాజు ఆధ్వర్యంలో గవిచర్ల, కొంకపాక, సుక్యాతండా, జయరాంతండా చెందిన రైతులకు మిరప పంటలో చీడపీడలు, తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్ రాజన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు కేవలం రసాయన ఎరువులపై ఆధారపడకుండా, పర్యావరణ అనుకూల జీవఆధారిత పురుగు మందులు, ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే వేప ఆధారిత ఉత్పత్తులు వాడాలని సూచించారు. వీటి ద్వారా చీడపీడలు, పురుగు మందుల నిరోధక శక్తి తగ్గుతుందని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా 13 మంది రైతులకు, గిరిజన ఉప ప్రణాళిక పథకం కింద 15 మంది రైతులకు వేప నూనె లీటర్ బాటిల్, వేప గింజల పొడి 40 కిలోల బస్తాలను పంపిణీ చేశామని రాజన్న తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు



తహసీల్దార్‌ను డబ్బులు డిమాండ్ చేసిన పీడీఎఫ్ పేపర్ విలేకరుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు: ఐనవోలు తహసీల్దార్‌ను డబ్బులు డిమాండ్ చేసిన పీడీఎఫ్ పేపర్ విలేకరులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన దామెర రవీందర్, దామెర రాజేందర్ కొంతకాలంగా ఓ పీడీఎఫ్ పత్రికలో పనిచేస్తున్నారు. అక్రమంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తమ పీడీఎఫ్ పేపర్‌లో ఉన్నతాధికారులు, వ్యాపారులు, నాయకులపై ఆధారాలు లేని వార్తలు ప్రచురించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఐనవోలు తహసీల్దార్‌పై కూడా ఆధారాలు లేని వార్తలు రాశారు. ఇలా వార్తలు రాయొద్దంటే రూ. 2 లక్షలు ఇవ్వాలని తహసీల్దార్‌ను డిమాండ్ చేశారు. ఈ ఘటనపై భయభ్రాంతులకు గురైన తహసీల్దార్ కనుపర్తి విక్రమ్ కుమార్.. ఈ నెల 20న రూ.20 వేలు ఆన్‌లైన్ పేమెంట్ చేశారు. అప్పటికే ఈ ఘటనతో తహసీల్దార్ మనస్తాపం చెంది తాను ఆత్మహత్యకు పాల్పడేలా సదరు విలేకరులు ప్రవర్తించారని అదే రోజు ఐనవోలు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 21న మరోసారి విలేకరి దామెర రవీందర్.. తహసీల్దార్ ఆఫీస్‌కెళ్లి మిగతా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గొడవకు దిగారు. దీంతో తాను ఏ తప్పు చేయనప్పుడు డబ్బులు ఎందుకు ఇవ్వాలని తహసీల్దార్ వాగ్వాదానికి దిగారు. ఇవ్వకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటావని తహసీల్దార్‌ను నెట్టేసి భయభ్రాంతులకు గురిచేయగా మరోసారి రూ.30 వేలు ఇచ్చి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. దామెర రవీందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అదే రోజు రాత్రి కేసు నమోదు చేసి నిందితులు దామెర రవీందర్, రాజేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



గ్రంథాలయం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



ములుగులో డీసీసీ బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

ములుగు రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులు జ్ఞానాన్ని పెంపొందించుకుని ఉద్యోగావకాశాలు పొందేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహద పడతాయని, గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క (అనసూయ) అన్నారు. మంగళవారం రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, ములుగు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, అదనపు కలెక్టర్ మహేందర్ జీతో కలిసి జిల్లా కేంద్రంలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన జిల్లా గ్రంథాలయ భవనం, లైబ్రరీ లోపల రూ. 16.50 లక్షల వ్యయంతో నిర్మించిన టాయిలెట్ బ్లాక్, కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు పొందేందుకు లైబ్రరీలు ఎంతో దోహదపడతాయన్నారు. జిల్లా కేంద్రంలోని రోడ్లను విస్తరించడానికి చర్యలు తీసుకోవడంతో పాటు రూ. కోటి వ్యయంతో కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరాలు తెలిసేలా జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ వద్ద జంక్షన్ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. రియాజ్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారానే అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో డీసీసీ బ్యాంకు ములుగు బ్రాంచ్ నూతన ప్రాంగణాన్ని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.అలివేలు, మున్సిపల్ కమిషనర్ సంపత్, డీసీఓ సర్దార్ సింగ్, డీసీసీ బ్యాంకు మేనేజర్ ఇంజపెల్లి తిరుపతి, తహసీల్దార్ విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ సైన్స్ వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా రామచంద్రం

- ఉత్తర్వులు అందజేసిన వీసీ ప్రతాప్‌రెడ్డి



రామచంద్రానికి ఉత్తర్వు కాపీ అందజేస్తున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : భద్రాద్రి కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీకాగా, వీసీ ప్రతాప్‌రెడ్డి ఆయనకు అందజేశారు. కేయూ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీని కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ యూనివర్సిటీగా మార్చారు. కాగా, ప్రొఫెసర్ రామచంద్రం 1991లో కేయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం కేయూ సైకాలజీ విభాగం అధిపతిగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది జనవరి 31నుంచి కేయూ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్నారు.

ఎర్త్ యూనివర్సిటీ ఓఎస్‌డీగా జగన్‌మోహన్ రాజు

కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన అసోసియేట్ ప్రొఫెసర్ జగన్‌మోహన్‌రాజును ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. ప్రస్తుత విద్యాసంవత్సరం 2025–2026లో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో వివిధ కొత్త కోర్సులు ఎమ్మెస్సీ జియాలజీ, జియో ఫిజిక్స్ తదితర కోర్సులతోపాటు ఇంజనీరింగ్ కోర్సుల్లోనూ ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రథమ సంవత్సరం కోర్సులు మొత్తం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి కిందికే వస్తాయి. ఇప్పటికే కొనసాగుతున్న ఇంజనీరింగ్ కోర్సుల సెకండియర్, ఫైనలియర్ కోర్సులు మాత్రం కేయూ పరిధిలోనే ఉంటాయి. ఆయా విద్యార్థులకు కేయూనే పరీక్షలు నిర్వహించి ఫలితాల సర్టిఫికెట్లు ఇవ్వనుంది. రెండేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మారనుంది.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు విద్యుత్ షాక్



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం సాయంత్రం ముగ్గురు విద్యార్థులకు విద్యుత్ షాక్ తగిలింది. పాఠశాల ముగిసిన తర్వాత ముగ్గురు విద్యార్థులు బట్టలు ఉతికి ఐరన్ తీగపై ఆరేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు, ఏఎన్ఎం కలిసి ఆ ముగ్గురిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు చికిత్స పొంది తిరిగి పాఠశాలకు రాగా, ఎనిమిదో తరగతి విద్యార్థి సాయిచరణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేద్దాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్
- పీటీసీలో పోలీస్ అధికారులతో సమీక్ష



నిర్వహణ కమిటీకి బాధ్యతలు వివరిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

మామునూరు: సమన్వయంతో పనిచేసి రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను విజయవంతం చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అధికారులకు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ(ఎస్పీ) అధ్యక్షతన డ్యూటీ మీట్ నిర్వహణపై మంగళవారం అధికారులతో సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌లో పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించడం ఆనందంగా ఉందని వివరించారు. ఈ పోటీల నిర్వహణకు నియమించిన కమిటీ సభ్యులు వారికి అప్పగించిన విధులను విజయవంతంగా పూర్తి చేయాలని, ఈ పోటీలకు సంబంధించి ఎలాంటి అనుమానాలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోటీలకు వచ్చే వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని కోరారు. అనంతరం పీటీసీ ప్రాంగణంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన సౌకర్యాలు సీపీ పరిశీలించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆతిథ్యమిస్తుండడంతో పోటీల నిర్వహణకు డీసీపీలు, ఏసీపీలు స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించడంతో పాటు వారు నిర్వహించాల్సిన బాధ్యతలను అప్పగించారు. సంబంధిత కమిటీ చేపట్టాల్సిన విధివిధానాలను సీపీ వారికి వివరించారు. సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, సీఐడీ ఎస్పీ రాం రెడ్డి, కమాండెంట్ రామకృష్ణ, అదనపు డీసీపీలు రవి, సురేశ్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్‌రావు పాటు కమిషనరేట్ సీఐడీ, రాష్ట్ర సెక్యూరిటీ విభాగానికి చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్భాషలాడుతున్నాడనే యాచకుడి హత్య..

- మతిస్థిమితం లేని వ్యక్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్

బచ్చన్నపేట : దుర్భాషలాడుతున్నాడనే కారణంతో మండల కేంద్రంలో ఓ మతిస్థిమితం లేని యాచకుడిని హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసినట్లు జనగామ ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద పురాణం ఉమాసాగర్ అనే వ్యక్తి తన తల్లితో కలిసి పునుగుల బండిని నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మతిస్థిమితం లేని యాచకుడు రాజిరెడ్డి(50) గిరాకీ ఉన్న సమయంలో పునుగుల బండి వద్దకు వెళ్లి అల్లరి చేస్తూ ఉమాసాగర్ వాళ్ల అమ్మను దుర్భాషలాడుతున్నాడు. దీంతో ఈ ఘటనపై పగ పెంచుకున్న ఉమాసాగర్.. ఎలాగైనా యాచకుడు రాజిరెడ్డిని హతమార్చాలని భావించాడు. ఇందుకుగాను మండల కేంద్రానికి చెందిన కోరుబోతుల అరుణ్, కోరుబోతుల రాజు, తంగళ్లపల్లి విజయ్ సాయంతో ఈ నెల 17న రాత్రి మండల కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ఓ బిల్డింగ్‌లో యాచకుడి తలపై రాళ్లతో మోదగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబర్చిన నర్మెట సీఐ అబ్బయ్య, ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్, కానిస్టేబుళ్లు రాకేశ్, రామన్న, అనిల్ కుమార్‌యాదవ్, భానుచందర్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, తిరుపతిని ఏఎస్పీ అభినందించారు.

పోక్సో కేసులో ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు



నర్సింహులపేట: పోక్సో కేసులో ఓ వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు జడ్జి మహ్మద్ రఫీ మంగళవారం తీర్పు వెలువరించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. నాలుగేళ్ల క్రితం నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన బానోత్ నవీన్‌పై పోక్సో కేసు నమోదైంది. దీనిపై చివరి వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితుడిపై నేరం రుజువుకావడంతో మూడేళ్ల జైలు, రూ.17 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి యత్నం..

- పోక్సో కేసు నమోదు

పాలకుర్తి టౌన్: బాలికపై ఓ వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటన మంగళవారం మండలంలోని తీగారంలో చోటు చేసుకుంది. ఎస్సై దూలం పవన్ కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోగు సోమయ్య(60) అదే గ్రామానికి చెందిన ఓ బాలికకు మాయ మాటలు చెప్పి ఇంటికి పిలిపించుకుని లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి అక్కడి నుంచి తప్పించుకుని ఇంటికెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు, స్థానికులు.. వృద్ధుడికి దేహశుద్ధి చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందుతుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FARM LAND FOR SALE

SSV. ఫామ్ ల్యాండ్స్ వరంగల్ నుండి కేవలం 20 కి.మీ॥ దూరంలో మం॥ రాయపర్తి, గ్రా॥ మురిపిరాల గుంట కేవలం 5,999/- లకే అగర్ వుడ్ చెట్లు మరియు ఎర్రచందనం మొక్కలతో అమ్మబడును. సంప్ర॥ 9010639595. [WA-7574]

WANTED

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9959031122 [B-1275594]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.